ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
మంగళవారం 13 ఫిబ్రవరి 2024



సింహ వాహనంపై తేజో విలాసం

కడప (కల్చరల్), ఫిబ్రవరి 12: తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవునికడప ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మూడవ రోజైన సోమవారం రాత్రి స్వామి వారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం 9 గంటలకు శ్రీనివాసుడు చిన్నశేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. 10-30 గంటలకు స్నపన తిరుమంజనం, సాయంత్రం 6 గంటలకు ఊంజల్‌సేవ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమోహన్, త్రివిక్రమ్ సారథ్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 8 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుమలేశుడు సింహ వాహనంలో కొలువుదీరి మాడవీధులలో ఊరేగాడు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కోలాటం

దేవుని కడప బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రాయచోటి, మాధవరం, కొత్తపల్లి ప్రాంతాల కళాకారులు ప్రదర్శించిన కోలాటం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు అన్నమాచార్య కీర్తనలతో భక్తులను అలరించారు.

అనధికార భద్రతను ఉపసంహరించండి : ఎమ్మెల్సీ

కడప (క్రైం), ఫిబ్రవరి 12: ఏ వ్యక్తికైనా భద్రత కల్పించాలంటే సెక్యూరిటీ రివ్యూ కమిటీ సిఫార్సు చేయాల్సి ఉంటుందని, కానీ జిల్లాలో అనేక మంది అధికార పార్టీ నాయకులకు అనధికారికంగా గన్‌మెన్లను ఇచ్చారని, వెంటనే ఆ భద్రతను ఉపసంహరించాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఎస్పీని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ ఎటువంటి హోదా లేనివారికి గన్‌మెన్ల భద్రత కల్పించడం పూర్తిగా అధికార దుర్వినియోగమే అన్నారు. మరికొంత మందికి వెపన్ లేకుండా పోలీసులను నియమించారన్నారు. ప్రతిపక్ష పార్టీల వారికి అధికార పార్టీ వారి నుంచి హాని ఉంటుంది కానీ అధికార పార్టీ వారికి హాని ఉందని చెప్పి పోలీసులను నియమించడం సరికాదన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీలకు ఏ విధంగా భద్రత కల్పించారో ప్రతిపక్ష పార్టీల ప్రజాప్రతినిధులకు కూడా అదే విధంగా భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

నేనిచ్చిన డబ్బు ఇచ్చెయ్..!

- గుడికి విరాళం కాదు.. పార్టీ కోసం ఇచ్చా
- మాట మార్చిన వైసీపీ నేత
- పార్టీ మారిన వారి నుంచి బలవంతంగా వసూలు
- ఇదేం విడ్డూరం అంటున్న గ్రామస్తులు

ఖాజీపేట, ఫిబ్రవరి 12: గుడికి, బడికి విరాళం ఇచ్చిన దాతలు ఎక్కడా వెనక్కు తిరిగి తీసుకున్న దాఖలాలు లేవు. వైసీపీ ప్రభుత్వంలో సీఎం జగన్ దగ్గరనుంచి అంతా రివర్స్. ఇక్కడా అదే జరిగింది. ఎస్సీ కాలనీలో నిర్మించుకున్న అంకాళమ్మ గుడికి విరాళంగా ఇచ్చిన మొత్తాన్ని ఆ వైసీపీ నేత తిరిగి వెనక్కు తీసుకున్నాడు. దీనికంతా కారణం వారు వైసీపీని వీడి టీడీపీలో చేరడమే.. ఖాజీపేట మండలం పుల్లూరు ఎస్సీ, ఎస్టీ కాలనీకి చెందిన బాబ్జి సోమవారం రాత్రి విలేకరులతో మాట్లాడుతూ.. కొన్ని నెలల క్రితం గ్రామంలో అంకాళమ్మ గుడిని నిర్మించుకున్నామన్నారు. కొంత డబ్బులు తక్కువ రావడంతో వైసీపీ నాయకుడు నాగేశ్వరరెడ్డి దగ్గరకు వెళ్లి చందా అడిగామని అయితే ఆయన లక్ష రూపాయలు విరాళం ఇచ్చారని అన్నారు. ఆదివారం మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో తనతో పాటు మరికొందరు గ్రామస్థులు వైసీపీని వీడి టీడీపీలో చేరామని అన్నారు. ఈ విషయం తెలిసి నాగేశ్వరరెడ్డి నేను మీ గుడికి విరాళం ఇవ్వలేదు, పార్టీకోసం ఇచ్చానని, మీరు పార్టీ మారారు కాబట్టి డబ్బులు తిరిగి ఇవ్వాలని హుకుం జారీ చేశారని అన్నారు. తమ దగ్గర డబ్బులు లేకపోవడంతో ట్రాక్టర్‌ను ఆయన దగ్గర పెట్టామన్నారు. చివరకు తలాకొంత వేసుకుని లక్షరూపాయలు తీసుకెళ్లి సోమవారం రాత్రి ఆయనకు ఇచ్చి తమ ట్రాక్టర్ తెచ్చుకున్నామని తెలిపారు. తాము ఎస్సీలం కావడంతో తమపై ఒత్తిడి తెచ్చారని, పార్టీ ఏదైనా గుడికి విరాళం ఇచ్చిన డబ్బు వెనక్కు తీసుకోవడం ఇప్పటివరకు చూడలేదన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న గ్రామస్థులు

క్రిష్టాసర్కిల్ నుంచి దేవునికడప రోడ్డులో వాహనదారుల అవస్థలు



పూర్తి కాని క్రిష్టాసర్కిల్ పనులు



సుందరీకరణ సా..గుతోంది

కడప సుందరీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో బుగ్గవంక సుందరీకరణ పనులు, భూగర్భ డ్రైనేజీ పనులు చేపడితే అవి కూడా నేటికీ పూర్తి కాలేదు. ఆలస్యం అమృతం విషం అన్నట్లుగా.. పనులు ఆలస్యం కావడంతో అంచనా వ్యయం పెరిగి తడిచి మోపెడవుతూ వస్తోంది. ప్రస్తుత సీఎం వైఎస్ జగన్ హయాంలో జిల్లా కేంద్రం కడపలో సా..గుతున్న సుందరీకరణ పనులతో జనం అవస్థలు పడుతున్నారు.

- పనులు పూర్తి కాక జనం అవస్థలు
- 50 రోజుల క్రితం రేయింబవళ్లు పనులు
- సీఎం ప్రారంభించిన తరువాత పనుల నత్తనడక
- దేవునికడపలో బ్రహ్మోత్సవాలు
- ఆ రోడ్డు పూర్తి కాక భక్తులకు నరకం
- సా..గుతున్న పనులతో వ్యాపారాలకు అడ్డంకులు


వై.జంక్షన్ నుంచి అప్సర వెళ్లే రహదారిలో అసంపూర్తి పనులు

(కడప-ఆంధ్రజ్యోతి): కడపలో రహదారుల విస్తరణ, డ్రైనేజీల పనులకు సీఎం జగన్ 2021 జూలైలో శంకుస్థాపన చేశారు. తొలుత కడప నగరంలో 16 రోడ్ల విస్తరణ చేపట్టాలని నిర్ణయించారు. అయితే మొదటి విడతలో మహావీర్ సర్కిల్, కలెక్టరేట్ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు పూర్తి చేశారు. రెండో విడతలో అంబేడ్కర్ సర్కిల్, వై.జంక్షన్, గోకుల్‌లాడ్జి, క్రిష్టాసర్కిల్, అన్నమయ్యసర్కిల్, క్రిష్టాసర్కిల్ - మాసాపేటసర్కిల్, దేవునికడప రోడ్డు, సాయిపేట రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. రెండేళ్లకిందటే సీఎం శంకుస్థాపన చేసినా నిధుల విడుదలలో ఆలస్యం కావడంతో పనులు మొదలు కాలేదు. చివరికి గత ఏడాది ద్వితీయార్థంలో పనులు మొదలుపెట్టారు. ప్రతి సంవత్సరం సీఎం వైఎస్ జగన్ క్రిస్మస్ పండుగకు జిల్లాకు వస్తున్నారు. దీంతో డిసెంబరులో సీఎం చేతులమీదుగా వీటిని ప్రారంభించాలని పనులను హడావుడిగా రేయింబవళ్లు చేశారు. ఈ సందర్భంగా దాదాపు రెండు నెలలు ప్రధాన రోడ్లన్నీ బ్లాక్ చేశారు. కొన్నిచోట్ల తవ్వేశారు. ఎంత వేగంగా చేసినా పనులు అనుకున్న సమయానికి పూర్తి కాలేదు. అయినా సరే.. అసంపూర్తి పనులనే డిసెంబరు 23న సీఎం జగన్ చేతుల మీదుగా ప్రారంభించారు. అంబేడ్కర్ సర్కిల్, అక్కడ నుంచి వై.జంక్షన్ వరకు రహదారి, కోటిరెడ్డిసర్కిల్, సెవెన్‌రోడ్స్‌ను సీఎం ప్రారంభించారు. అంతే అధికారులంతా రిలాక్స్ అయిపోయినట్లున్నారు.

సీఎం ప్రారంభించి వెళ్లిన తర్వాత.. దాదాపు 50 రోజులుగా పనులు చాలా నెమ్మదిగా సాగుతున్నాయి. వైజంక్షన్ పనులు ఇంకా పూర్తికాలేదు. వైజంక్షన్ నుంచి అప్సర వరకు డ్రైనేజీ నిర్మాణాలు సాగుతూనే ఉన్నాయి. దీంతో ఇక్కడ వ్యాపారాలు బాగా దెబ్బతిన్నాయి.

దేవునికడప వెళ్లాలంటే అవస్థలు

గోకుల్‌లాడ్జి నుంచి క్రిష్టాసర్కిల్ మీదుగా అన్నమయ్య విగ్రహం వరకు చేపట్టిన రహదారి పనులు ఇంకా పూర్తికాలేదు. క్రిష్టాసర్కిల్ పనులు పూర్తి కాకపోయినప్పటికీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయరు సురేశ్‌బాబు ఇక్కడ క్రిష్ణదేవరాయల విగ్రహాన్ని ప్రారంభించారు. క్రిష్టాసర్కిల్ వద్ద ఇంకా పనులు సాగుతూనే ఉన్నాయి. క్రిష్టాసర్కిల్ నుంచి దేవునికడప వెళ్లేరహదారి పనులు నెలల తరబడి సా..గుతూనే ఉన్నాయి. తిరుమల తొలిగడప దేవునికడప లక్ష్మి వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇది జిల్లాలో హిందువులకు అతిపెద్ద వేడుక. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్దఎత్తున వెళుతుంటారు. అధ్వాన్న రోడ్డుతో జనం అవస్థలు పడుతున్నారు.

డ్రైనేజీ పనులూ సా...గుతున్నాయి..

ఇక డ్రైనేజీ పనులు జరిగే తీరు చూస్తుంటే ఎప్పటికి పూర్తవుతాయో కూడా తెలీని స్థితి. మాసాపేట సర్కిల్‌నుంచి మార్కెట్‌యార్డు మీదుగా దేవునికడప వెళ్లే డ్రైనేజీ పనులు సాగుతూనే ఉన్నాయి. ఎక్కడ పడితే అక్కడ మట్టి, ఇతర పనులు జరుగుతుండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ నిర్మాణం పనులు జరుగుతుండటంతో వ్యాపారాలకు ఇబ్బందికరంగా ఉందని వ్యాపారులు వాపోతున్నారు. రోడ్డంతా దుమ్ముమయంగా మారింది. ఎటు చూసినా దుమ్మే ఉంటోంది. క్రిష్ణసర్కిల్, అన్నమయ్య సర్కిల్, మార్కెట్‌యార్డు సర్కిల్ పూర్తికాలేదు. నత్తనడకన పనులు జరుగుతుండడంతో జనం బేజారవుతున్నారు.


మాసాపేట సర్కిల్ నుంచి దేవునికడప వెళ్లే రోడ్డులో సాగుతున్న పనులు


మార్కెట్‌యార్డు వద్ద నిలిచిన సర్కిల్ పనులు

బిల్లులు వస్తేనే బీటీ రోడ్లు

- బిల్లులు రాక నిలిచిన 25 బీటీ రోడ్లు
- అవస్థలు పడుతున్న అధికారపార్టీ కాంట్రాక్టర్లు

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పంచాయతీరాజ్ పీఐఏ నిధుల కింద బద్వేలు నియోజకవర్గానికి రూ.50కోట్లు మంజూరు చేశారు. కానీ రూ.37.50 కోట్లకు టెండర్లు పిలిచారు. వెంటనే అధికార పార్టీకి చెందిన కాంట్రాక్టర్లు త్వరగా బిల్లులు వస్తాయికదా అన్న ఆశతో అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పనులు ప్రారంభిస్తే.. ఏడాది అవుతున్నా బిల్లులు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. 30 పనులకు గాను ఐదు రోడ్లకు మాత్రమే బీటీ (తారు) రోడ్లు వేయగా మిగిలినవి చిప్స్ పరిచి వదిలివేశారు. బిల్లులు వస్తే మిగిలిన పనులు చేద్దాం అన్నట్టుగా కాంట్రాక్టర్లు ఉన్నారు.


ఎగువ తంబళ్లపల్లెలో బీటీ రోడ్డు వేయకపోవడంతో చిప్స్ కనిపిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 12: బద్వేలు నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి గత ఏడాది జనవరిలో పనులు మంజూరై నిధులు శాంక్షన్ కాగా, ఈ జనవరికి పనులు పూర్తి చేయాల్సి ఉంది. కానీ బిల్లులు చెల్లింపులో జాప్యం కావడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారు. అందినంత వరకు అప్పులు తెచ్చాం, ఇప్పట్లో మరలా అప్పులు తెచ్చి వేసే పరిస్థితి లేదు. బిల్లులు వస్తే అప్పుడు రోడ్డేద్దాం అనే ధోరణిలో ఉన్నారు. కాంట్రాక్టర్లు బిల్లుల వ్యవహారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోగా.. ఈ బిల్లులు ఇప్పుడు వచ్చే పరిస్థితి లేదని, మే నెలలో చూద్దాంలే, మరలా మన ప్రభుత్వమే కదా వచ్చేది. బిల్లులు ఎక్కడికి పోతాయి అని సమాధానం ఇచ్చారని సమాచారం. దీంతో ఆందోళనకు గురైన కాంట్రాక్టర్లు బద్వేలు నియోజకవర్గంలో బీటీ రోడ్డు పనులు ఎక్కడికక్కడ ఆపేశారు.

పోరుమామిళ్ల, కలసపాడు, అట్లూరు, బద్వేలు, గోపవరం మండలాల్లో కొంతమేర బీటీ రోడ్లు పూర్తి చేశారు. కొన్నిచోట్ల చిప్స్ మాత్రమే వేసి తారు వేయకుండా వదిలేశారు. కాశినాయన మండలంలో కోటి 15 లక్షలతో బీటీ రోడ్లు వేయాల్సి ఉంది. గంగనపల్లె ప్రాంతంలో చిప్స్ వేసి వదిలేశారు. రాజాసాహెబ్‌పేట - సిద్దవరం వరకు రూ.2.80కోట్ల రోడ్డు పనులకు సంబంధించి చిప్స్ వేశారు. ముద్దంవారిపల్లె బ్రిడ్జికి సంబంధించి కోటి రూపాయలు మంజూరు కాగా, శ్లాబు లెవల్ పిల్లర్స్ వేశారు. బిల్లులు వస్తే శ్లాబు వేయాలనే పరిస్థితుల్లో కాంట్రాక్టర్లు ఉండిపోయారు. బి.కోడూరు మండలంలో పందివీడు, నరసారెడ్డిపల్లెలో పనులు పూర్తికావాల్సి ఉంది. తువ్వపల్లెలో పనులు మొదలు పెట్టి అలాగే వదిలివేశారు.

మొత్తంమీద బద్వేలు నియోజకవర్గంలో ఇప్పటి వరకు దాదాపు రూ.25 కోట్ల పనులు జరిగినా ఇంత వరకు బిల్లులు అందలేదని తెలిసింది. దీంతో కాంట్రాక్టర్లు ఎక్కడికక్కడ పనులు ఆపేశారు. బిల్లులు వచ్చాక తారు వేద్దాం అనే ధోరణిలో కాంట్రాక్టర్లు ఉన్నట్లు తెలిసింది. దీనికి తోడు వీరికిచ్చిన ఏడాది గడువు ముగిసింది. గడువులోగా పనులు పూర్తి కాకపోవడంతో.. అదనపు సమయం కోసం అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం పంపారని తెలిసింది. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకుండా అదనపు సమయం ఇచ్చినా ప్రయోజనం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల రహదారులు త్వరగా పూర్తి చేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

ఈ విషయమై పంచాయతీరాజ్ పీఐఏ డీఈ అమరనాథ్‌ను వివరణ కోరగా, ఇప్పటి వరకు దాదాపు రూ.25 కోట్ల వరకు పనులు పూర్తయ్యాయన్నారు. కొన్నిచోట్ల బీటీ రోడ్లు వేయాల్సి ఉందని కాంట్రాక్టర్లను మొబలైజ్ చేస్తున్నామన్నారు. పనులకు సంబంధించిన గడువు పెంచాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు.


ముద్దంవారిపల్లె వద్ద నిధులు రాకపోవడంతో అసంపూర్తిగా ఉన్న బ్రిడ్జి నిర్మాణం


దమ్మనపల్లె నుంచి కాల్వకట్ట వరకు నిలిచిన రహదారి పనులు

స్పందన అర్జీలను వెంటనే పరిష్కరించాలి : కలెక్టర్


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 12: స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల ద్వారా అందే అర్జీలలకు సత్వరమే పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టర్‌కు విన్నవించారు. ఫిర్యాదులను కలెక్టర్ పరిశీలించిన మీదట తదుపరి చర్యలకై సంబంధిత శాఖలకు సిఫారసు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు పరష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

ఫారం 6, 7, 8లను పెండింగ్ లేకుండా చూడాలి

ఓటర్ల జాబితాకు సంబంధించి పారం 6, 7, 8 అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించి పెండింగ్ లేకుండా చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ప్రయార్టీ బిల్డింగ్స్, కులగణన, ఆరోగ్యసురక్ష, ఆరోగ్యశ్రీ కార్డులు, ఏపీ సర్వీసెస్, హౌసింగ్ తదితర అంశాలపై జేసీ గణేశ్‌కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూషలతో కలసి మండల అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలాంటి అలసత్వం లేకుండా ప్రజలకు అందించాలన్నారు. అలాగే ప్రాధాన్యత భవనాలకు సంబంధించి స్టేజీ కన్వర్షన్స్ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఓటర్ల జాబితాకు సంబంధించి అర్జీలను ఏ రోజుకు ఆరోజు బీఎల్వోలు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు మధుసూదన్, శ్రీనివాసులు, ఈఆర్వో కౌసరుభాను, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బీసీలకు ఎమ్మెల్యే టికెట్టివ్వండి

- బస్సుయాత్రలో సమ న్యాయమన్నారు..
- టికెట్టు విషయంలో సామాజిక సమన్యాయం చూపండి
- 18న ప్రొద్దుటూరులో బీసీల ఆత్మగౌరవ సభ

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 12: వైసీపీ వారు ప్రొద్దుటూరులో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర సందర్భంగా సమన్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, ఎమ్మెల్యే టిక్కెట్టు బీసీలకు ఇచ్చి సామాజిక సమన్యాయం అమలు చేయాలని సీఎం వైఎస్ జగన్‌కు బీసీ సంఘాల నేతలు సూచించారు. బీసీ నేత నందం సుబ్బయ్యను కిరాతకంగా చంపిన హంతకులకు టికెట్టు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం బొర్రా రామాంజనేయులు, చెన్నా సరళాదేవి, గొర్రె శ్రీనివాసులు బీసీ సంఘాల నేతలతో కలసి స్థానిక పద్మశాలీయ కల్యాణమండపంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బీసీలకు నామినేటెడ్ పదవులు ఇవ్వడం, నిధులులేని కార్పొరేషన్ పదవులివ్వడం కాదని చట్టసభల్లో బీసీ జనాభా దామాషా ప్రకారం సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీసీల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు సమర్థులు లేరని బీసీ నాయకులచేత మాట్లాడించే కుట్ర పూరిత వైఖరి మానుకోవాలని హితవుపలికారు. ఈ నెల 18న ప్రొద్దుటూరు టీటీడీ కల్యాణ మండపంలో జరిగే బీసీల ఆత్మగౌరవ సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి కార్యాచరణ చేపడతామన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు నందు శివనారాయణ, బీవీ రాజు, మార్కెండేయ, సంటెన్న, శ్రీనివాసులు, సుప్రీంకోర్టు న్యాయవాది పోలంకి జనార్ధన్, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీసీ నేతలు

మాపై దయ చూపండి

- 18 నెలలుగా అందని వేతనాలు
- కుటుంబ పోషణ కష్టంగా ఉంది
- పారిశుధ్య కార్మికుల ఆవేదన

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 12: వాళ్లంతా వీధుల్లో చెత్తా చెదారం శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతుంటారు... అయితే వీళ్లకు 18 నెలలుగా జీతాలు లేకపోవడంతో కుటుంబం గడవడం కష్టంగా మారిందని.. తాము ఏదైనా రోగం వస్తే బాగు చేయించుకోవడానికి వైద్య ఖర్చులకు డబ్బులు కూడా లేక తీవ్ర ఇబ్బందులు పడుతు న్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..

బ్రహ్మంగారిమఠం మండలంలోని 11 గ్రామ పంచాయతీల్లో జనాభా బట్టి అక్కడున్న సర్పంచ్‌లు గ్రామాల్లో పారిశుధ్య కార్మికుల (క్లాప్‌మిత్ర)ను ఎంపిక చేసుకున్నారు. మండలంలో మేజరు పంచా యతీ అయిన సోమిరెడ్డిపల్లె పంచాయతీలో 15 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. ఈ పంచాయతీ పరిధిలోనే ప్రముఖ పుణ్యక్షేత్రం బ్రహ్మంగారిమఠం దేవస్థానం ఉండడంతో ఇక్కడికి దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో యాత్రికులు వస్తూ పోతూ వుంటారు. యాత్రికులు రోడ్లపై వేసే చిత్తు కాగితాలు, చెత్త చెదారాలను పారిశుధ్య కార్మికులు శుభ్రపరుస్తుంటారు. అలాగే ప్రతిరోజూ ఇంటి వద్ద నుంచి తెల్లవారుజామున 4గంటలకు బయల్దేరి పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకుని.. అక్కడ నుండి ట్రైసైకిళ్లు తీసుకుని ప్రతి గ్రామానికి వెళుతూ రోడ్లపై ఉన్న చెత్త చెదారాన్ని ఊడుస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతుంటారు. ఇలా మండల వ్యాప్తంగా



జీతాలు ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్న పారిశుధ్య కార్మికులు



వీధుల్లో చెత్తా చెదారాన్ని శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికుడు

124 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ.6వేలు వేతనం ఇచ్చేవారు. అది కుటుంబ పోషణకు ఏమాత్రం సరిపోకపోయినా కూడా పనిచేసేవాళ్లమని.. ఆ ఇచ్చే వేతనం ప్రతి నెలా మంజూరు చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 18 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని.. దీంతో మా కుటుంబాలు పస్తులుండాల్సి వస్తోందని వాపోతున్నారు. వెంటనే ప్రభుత్వ అధికారులు స్పందించి తమకు వేతనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైద్య ఖర్చులకు డబ్బులు లేవు



ప్రతిరోజూ ఎంతో కష్టపడి వీధుల్లోని చెత్తా చెదారం ఊడ్చి శుభ్రప రుస్తాం. మా కష్టానికి ప్రతిఫలం అందడం లేదు. మాకు ఇస్తున్న చాలీచాలని జీతం కూడా... నెలల తరబడి ఇవ్వడం లేదు. దీంతో ఏదైనా జబ్బు చేస్తు.. కనీసం వైద్య చికిత్సలు చేయించు కోవడానికి కూడా తమ వద్ద డబ్బులు లేవు. వెంటనే తమకు ఇవ్వాలని వేత నాలను ప్రభుత్వం మంజూరు చేయాలి.

-కటారి జయరాములు, పారిశుధ్య కార్మికుడు

కుటుంబ పోషణ ఇబ్బందిగా ఉంది



18 నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబాన్ని పోషించు కోవడానికి చాల ఇబ్బందిగా ఉంది. ప్రతిరోజూ విధులకు రమ్మని అధికారులు పిలుస్తారు.. కానీ తమ వేతనాల గురించి పట్టించు కోవడం లేదు. ప్రభుత్వం వెంటనే స్పం దించి జీతాలు మంజూరు చేసి తమ కుటుం బాలను ఆదుకోవాలి.

-కోడూరు చిన్నప్ప, పారిశుధ్య కార్మికుడు

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

- 21 వాహనాలు స్వాధీనం
- ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ వెల్లడి



మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్, పక్కన డీఎస్పీ సీఐలు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 12: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న బత్తల అంకయ్య అనే వ్యక్తిని త్రీటౌన్ పోలీసులు అరెస్టు చేసి.. 21 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ స్థానిక త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ప్రొద్దుటూరులో ద్విచక్ర వాహనాలు దొంగతనాలు పెరిగిపోయాయని వచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారన్నారు. చాపాడు మండలం చిన్న వరదాయపల్లెకు చెందిన గొర్ల ఈశ్వరయ్య అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం జనవరి 26వ తేదీ ప్రొద్దుటూరు పాత బస్టాండ్ వద్ద ఉంచగా.. గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు విచారణ చేపట్టారు. కేసు విచారణలో భాగంగా బత్తల అంకయ్య అనే నిందితుని పొట్టి పాడురోడ్డులోని సింగం ఫంక్షన్ హాలు దగ్గర అరెస్ట్ చేశారు. అతను ఇచ్చిన సమాచారం మేరకు... ఈశ్వరయ్యకు చెందిన మోటారు సైకిల్‌తో పాటు ప్రొద్దుటూరు శివారులోని పాడుబడిన ఒక ఇంటిలో దాచి ఉంచిన 20 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఈ కేసు విచారణలో సీఐ వెంకటరమణ, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు తిరుమలయ్య, దస్తగిరి, లక్ష్మీకాంత్‌రెడ్డి, ధనాంజనేయ ఇతర సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

విజిలెన్స్ దాడులు...ఐదు సిలిండర్లు సీజ్



సిలిండర్లను చూపుతున్న విజిలెన్స్ అధికారులు

కడప (క్రైం), ఫిబ్రవరి 12 : కడప నగర పరిధిలోని సీకేదిన్నె, క్రిష్ణాపురం రోడ్డులో గల హోటల్‌ను విజిలెన్స్ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి మాసుం బాషా ఆదేశాల మేరకు కడప సీఎస్‌డీటీలతో కలిసి తనిఖీలు చేపట్టారు. హోటల్‌లోని ఐదు గృహావసరాల సిలిండర్లు వ్యాపారానికి వాడుతున్నట్లు గుర్తించి సీజ్ చేశారు. హోటల్ యజమానిపై కేసు నమోదు చేశారు. విజిలెన్స్ అధికారులు ఈదురుబాషా, బాలగంగాధర్ రెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసరు సౌజన్య, హెడ్ కానిస్టేబుల్ జనార్ధనరావు, రంతు బాషా పాల్గొన్నారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం?



పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్లు సుండుపల్లె స్టేషన్‌లో ఉంచిన దృశ్యం

సుండుపల్లె, ఫిబ్రవరి 12: పింఛా నది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. పింఛా జలాశయం దిగువ భాగంలో ముడుంపాడు సమీపం నుంచి అక్రమంగా ప్రతిరోజు ఇసుక తరలిస్తున్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో దాడి చేసి ట్రాక్టర్లను పట్టుకున్నట్లు సమాచారం. ప్రతిరోజు పింఛా నది నుంచి ఇసుకను కేవీపల్లె, పీలేరు, భాకరా పేట, రొంపిచర్లకు తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. పట్టుబడిన నాలుగు ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌లో ఉంచినట్లు సమాచారం.

సరిహద్దు చెక్ పోస్టుల్లో పటిష్ఠ బందోబస్తు

- కర్ణాటక మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తాం
- ములకలచెరువు ఎస్ఈబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెల్లడి

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 12 : కర్ణాటక సరి హద్దుగా ఉన్న పీటీఎం మండలంలోని అన్ని చెక్‌పోస్టులలో కర్ణాటక మద్యం అక్రమ రవాణా దృష్ట్యా పటిష్ట బందో బస్తును ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టినట్లు ములకలచెరువు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ జి.రామ్మోహన్ వెల్లడించారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ' జోరుగా కర్ణాటక మద్యం విక్రయాలు' అన్న శీర్షికన కథనం ప్రచురితమవ్వడంతో స్పందించిన ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్ సోమవారం పీటీఎం మండలంలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న చెక్ పోస్టులను పరిశీ లించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం నుంచి 10 లీటర్ల లోపు అక్రమంగా మద్యాన్ని తరలిస్తూ పట్టుబడితే కేసులు ఉండవన్నది అవాస్త వం. అయితే అటువంటి వారిని స్థానిక పోలీస్ స్టేషన్లలో స్టేషన్ బెయిల్‌పై విడుదల చేస్తారు. కానీ అటువంటి వారు ఖచ్చితంగా కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. 2023 జనవరి నుంచి ఇప్పటి వరకు కర్ణాటక రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న 70 కేసులు నమోదు చేసి 85 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. ఇందులో 1128 లీటర్ల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని, మద్యం తరలిస్తూ 26 వివిధ వాహనాలను సీజ్ చేశామని ఆయన పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు పీటీఎం మండలంలో సరిహద్దు గ్రామాల్లో కర్ణాటక అక్రమ రవాణాను నివారించేందుకు సరిహద్దుల్లో 4 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, పీటీఎం పోలీసులతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటి కప్పుడు కర్ణాటక మద్యం రవాణాను అడ్డుకుంటున్నామన్నారు. పీటీఎం మండలంలోని ఏ గ్రామంలోనైనా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్నట్లు తెలిస్తే అటువంటి వారు 9440902534 నంబర్‌కు ఫోన్ ద్వారా సమాచారాన్ని అందిస్తే అటువంటివారి పేరును గోప్యంగా ఉంచుతామని ఆయన వెల్లడించారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం..కారు సీజ్

- నిందితుడి అరెస్టు
- 1350 టెట్రా పాకెట్లు, 48 క్వార్టర్ బాటిళ్లు లభ్యం

వాల్మీకిపురం, ఫిబ్రవరి 12: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని పోలీసులు సీజ్ చేశారు. సీఐ పులి శేఖర్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వాల్మీకిపురం రైల్వే స్టేషన్ సమీపంలో వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో ఏపీ39వీ యు5483 నెంబర్ గల కారులో అను మానాస్పద సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కారులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన 1350 టేట్రా మద్యం పాకెట్లు, 48 క్వాటర్ బాటిళ్లు బయటపడ్డాయి. మద్యంతో పాటుగా కారును సీజ్ చేసి, అక్రమ రవాణాకు పాల్పడిన వాల్మీకిపురానికి చెందిన వ్యక్తి నరసింహులు(36)ను అరెస్టు చేశారు. స్థానిక ఎస్ఐ నాగేశ్వర్‌రావు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది సతీష్, అబ్దుల్లా, రిజ్వాన్, రామచంద్రనాయక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకిపురంలో పోలీసులు సీజ్ చేసిన కర్ణాటక మద్యం

జింకను కుక్కల బారినుంచి రక్షించిన హోంగార్డులు



జింకకు ప్రథమ చికిత్స చేస్తున్న హోంగార్డు సురేశ్

సుండుపల్లె, ఫిబ్రవరి 12: మండలంలోని రాయవరం గ్రామ అడవుల నుంచి దాహార్తితో రాయవరం ఏటి పరిసరాల ప్రాంతానికి సోమవారం ఉదయం జింక వచ్చింది. గమనించిన కుక్కలు జింకపై దాడికి పాల్ప డి గాయపరిచాయి. హోంగార్డులు సురేశ్, అనిల్ కుక్కల బారినుంచి జింకను రక్షించారు. అనంతరం సానిపాయి రేంజ్ ఫారెస్టు అధికారులకు అప్పగించారు. వారిని ఫారెస్టు అధికారులు అభినందించారు. ప్రస్తుతం వేసవి సమీపిస్తుండడంతో అటవీ ప్రాంతంలో నీటి నిల్వలు లేకపోవడం వలన పల్లెల దగ్గరికి వస్తున్నాయని తెలిపారు. ఎవరికైనా అడవి జంతువులు కనపడితే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

కడప (క్రైం), ఫిబ్రవరి 12 : కడప నగరం ఎర్రముక్కపల్లెలో బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి తెలిపారు. సీకేదిన్నె మండలం ఇందిరానగర్‌కు చెందిన చిలకల జాన్ 40 క్వార్టర్ మద్యం బాటిళ్లు విక్రయిస్తుండగా అరెస్టు చేసి.. మద్యం బాటళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి దివ్యాంగుల క్రికెట్ పోటీల్లో సత్తాచాటిన సుబ్బయ్య



రన్నర్స్‌గా నిలిచిన ఆంధ్రజట్టులో పాల్గొన్న సుబ్బయ్య

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 12: జాతీయస్థాయి దివ్యాంగుల క్రికెట్ టోర్నమెంట్‌లో లక్కిరెడ్డి పల్లెకు చెందిన కట్టా సుబ్బయ్య సత్తా చాటాడు. రాజాస్థాన్‌లో సోమవారం జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్రజట్టు రన్నర్‌గా నిలిచింది. ఆంధ్ర జట్టు తరఫున ఆడిన వికలాంగుడు సుబ్బయ్య బౌలర్‌గా మంచి ప్రతిభ కనబరిచి ప్రశాంశ పత్రం అందుకున్నాడు. రాష్ట్ర దివ్యాంగుల ఉపాధ్యక్షుడు వెంకటరామరాజు, రైతు సంఘం నాయకుడు రంగారెడ్డి సుబ్బయ్యను అభినందించారు.

కాంగ్రెస్ పార్టీ లీగల్‌సెల్ చైర్మన్‌గా వెంకటరమణారెడ్డి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 12: అన్నమయ్య జిల్లా కాంగ్రెస్‌పార్టీ లీగల్‌సెల్ చైర్మన్‌గా తొట్లి వెంకటరమణారెడ్డి నియమితులయ్యా రు. ఈ మేరకు ఏపీసీసీ లీగల్‌సెల్ చైర్మన్ శాస్త్రి జంధ్యాల ఉత్తర్వులు జారీ చేశారు. మదనపల్లెలో న్యాయవాదిగా పనిచేస్తున్న వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి లీగల్‌గా తన సేవలు అందిస్తానని, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు..

పొగలు వ్యాపిస్తున్నాయి..

- కమ్ముకుంటున్న కాలుష్యం
- రోగాలు వస్తున్నాయని ఆవేదన
- ఊరికి దూరంగా డంపింగ్‌యార్డు తరలించాలని వేడుకోలు



రైల్వేకోడూరు గుంజననది పక్కనే ఉన్న డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగలు



డంపింగ్‌యార్డులో చెలరేగిన మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 12: ఊరికి దూరంగా ఉండాల్సిన డంపింగ్ యార్డు పట్టణానికి అతి దగ్గరలో ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు అవస్థలు పడుతున్నారు. డంపింగ్‌యార్డులో ప్రతి నిత్యం వ్యర్థాలను కాల్చడంతో వచ్చే కాలుష్యంతో వ్యాధులు బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వేకోడూరు పట్టణంలోని వెంకయ్యస్వామి ఆలయానికి సమీపంలో గుంజననది పక్కనే డంపింగ్‌యార్డు ఉంది. ఇక్కడకు సమీపంలో నరసరాంపేట, గుర్రప్ప పాళెం గిరిజన కాలనీతో పాటు వెంకయ్యస్వామి ఆలయం ఉంది. ఈ ప్రాంతంలో నిరుపేద కుటుంబాలకు చెందిన వారు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. డంపింగ్ యార్డులోని వ్యర్థాలను కాల్చే సమయంలో పొగలు వ్యాపించడంతో పాటు దూళి వస్తోంది. దీంతో తాము రోగాల బారిన పడుతున్నామని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక ఆస్మా, టీబీ తదితర వ్యాధులు ఉన్న వాళ్లు తీవ్ర ఇబ్బందికరంగా ఉందని వాపోతున్నారు. ఈ సమస్య గురించి పలుమార్లు పంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. రెండు రోజుల క్రితం డంపింగ్‌యార్డులో మంటలు చెలరేగడంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. అయినప్పటికీ పొగలు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డంపింగ్ యార్డును ఊరికి దూరంగా తరలించాలని వారు కోరుతున్నారు.

విద్యుత్ బకాయిలు మార్చికి పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 12: పెండింగులో ఉన్న విద్యుత్ బకాయిలను మార్చి నాటికి పూర్తి చేయాలని అడ్మినిస్ట్రేటివ్ చీఫ్ జనరల్ మేనేజరు రమాదేవి, రెవెన్యూ చీఫ్ జనరల్ మేనేజరు ధర్మజ్ఞాని అన్నారు. సోమవారం ఉదయం విద్యుత్ భవన్‌లో సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో పేరుకుపోయిన బకాయిలను మార్చి చివరి తేది నాటికి పూర్తి చేయాలన్నారు. విద్యుత్ వాడకంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఉద్యోగి బాధ్యతగా పనిచేస్తూ.. పనితీరు మెరుగుపరుచుకోవాలన్నారు. సంస్థకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. సీనియర్ అకౌంట్ ఆఫీసరు మధుకుమార్, అకౌంట్ ఆఫీసరు మల్లిఖార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటిమిట్ట చెరువు చేరిన సోమశిల వెనుక జలాలు



నీరు విడుదలవుతున్న దృశ్యం

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 12: ఒంటిమిట్ట చెరువుకు సోమవారం కుడమలూరు వద్ద నుంచి సోమశిల వెనుక జలాలను పైపులైను ద్వారా వదిలారు. వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఐదు సంవత్సరాలుగా నీటిని వదలకపోవడంతో చెరువు పూర్తిగా ఎండిపోయింది. దీంతో రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో స్థానిక నాయకులు, అధికారులు గత కొద్ది రోజులుగా పైపులైనుకు మరమ్మతు పనులను చేపట్టారు. సోమశిల ఎత్తిపోతల పథకానికి మెయింటినెన్స్ కింద డబ్బులు లేకపోవడం, మోటార్లను ఉపయోగించ కపోవడంతో చెరువుకు ఐదేళ్లుగా నీటి విడుదల చేపట్టలేదు. సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో స్థానిక ప్రజల్లో వ్యతిరేక తొలగించేందుకు మళ్లీ ఇప్పుడు హడావుడిగా చెరువు నీరు విడుదల చేపట్టారు. ఏదేమైనా వేసవికాలం రానున్న నేప థ్యంలో తాగు, సాగు నీటికి కొంత మేర ఇబ్బంది ఉండదని.. చెరువుకు నీరు చేరడం పట్ల స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే చెరువుకు నీళ్లు ఎన్ని రోజులు మోటార్ల ద్వారా విడుదల చేస్తారో అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అధిక కేసుల రాజీకి కృషి చేయాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప(రూరల్) ఫిబ్రవరి 12: జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మార్చి 9న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసులను రాజీ చేసేందుకు పోలీస్ అధికారులు కృషి చేయాలని జిల్లా ప్రధాన జడ్జి, డీఎల్ఎస్ఏ చైర్మన్ జి.శ్రీదేవి పేర్కొన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో సోమవారం పోలీసులతో ముందస్తు లోక్ అదాలత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవడం వలన డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. లోక్ అదాలత్‌లో ఒకసారి కేసు పరిష్కారం అయితే తిరిగి అపీల్ చేసుకోవడానికి వీలు పడదని.. సుప్రీం కోర్టు తీర్పుతో సమానమన్నారు. ఈ ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి ఆయా పోలీస్ స్టేషన్ల వారీగా అధిక కేసుల పరిష్కారానికి తోడ్పడాలన్నారు. ఈ మీటింగ్‌లో పలువురు పోలీస్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

గుర్రంకొండ, ఫిబ్రవరి 12:వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన కేసు లో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసనాయక్ తెలిపారు. మండలంలోని చెర్లోపల్లె పంచాయితీ కిల్లారివాండ్లప ల్లెకు చెందిన టి.శ్రీనివాసులు(32) కుటుంబానికి అదే గ్రామానికి చెందిన చిన్నరమణయ్య కుటుంబానికి పాత కక్షలున్నాయి. ఈ క్రమంలో ఆదివారం రాత్రి శ్రీనివాసులు ఇంటి బయట ఉండగా పాత కక్షను మనుసులో పెట్టుకొని చిన్నరమణయ్య, అతని కుమారులు రమేష్, రవిలు కర్ర, గొడ్డలితో దాడి చేశారు. ఈ దాడిలో శ్రీనివాసులు తలకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. గాయ పడిని అతడిని వాల్మీకీపురం ప్రభుత్వం ఆసుపత్రికి తరలిం చారు. బాధితుని తండ్రి పెద్దరమణయ్య ఫిర్యాదు మేరకు పోలీ సులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

మోసగాళ్లకు ఓట్ల రూపంలో బుద్ధి చెప్పాలి

● బీసీలంతా టీడీపీ వైపే ● పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి




మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి.. సభకు హాజరైన బీసీ నాయకులు

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 12 : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఓట్ల కోసం మోసగాళ్లు వస్తున్నారని వారికి ఓటు ద్వారానే సమాధానం చెప్పాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అమరావతి కళ్యాణ మండపంలో జయహో బీసీ సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, యువ నాయకుడు కృష్ణచైతన్యరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో బీసీలకు అధిక ప్రాధాన్యత లభిస్తుందన్నారు. నాటి ఎన్టీఆర్ నుంచి నేటి చంద్రబాబునాయుడు వరకు అన్ని విభాగాల్లో బీసీలకే మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. బీసీలకు మొట్టమొదటగా రిజర్వేషన్ ఏర్పాటు చేసిన ఘనత ఎన్టీఆర్‌దేన్నారు. టీడీపీ మూలస్తంభం బీసీలే అన్నారు. ఇప్పుడు చాలా మంది బీసీ కులాలు వైసీపీకి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 2014 నుంచి 2019 వరకు బీసీలకు అన్ని రకాల సబ్సిడీ రుణాలను అందించారన్నారు. కానీ నేటి ప్రభుత్వం ఒక్క బీసీ కులానికైనా ఒక్క లోన్ ఇచ్చిందా అని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు అన్ని కులాలకు విదేశీ విద్య రూపంలో ఉన్నత చదువులు చదువుకునేందుకు ఆర్థిక సాయం చేశారని గుర్తు చేశారు. చంద్రబాబు ప్రభుత్వంలో గృహ నిర్మాణానికి రూ.1.50 లక్షలు ఇస్తున్నారని అది సరిపోదని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఐదు లక్షలతో గృహ నిర్మాణం చేపడతామని అబద్ధపు హామీలు ఇచ్చి ప్రస్తుతం రూ.1.80 లక్షలతో చేతులు దులుపుకుందన్నారు. నిరుద్యోగ యువతకు మోసగించారన్నారు. గతంలో పంటలు పండకపోతే రైతులకు ఇన్సురెన్స్ వచ్చేదని, కానీ ఇప్పుడు ఇన్సురెన్స్ ఒక్క రైతు కన్నా వచ్చిందా అని ప్రశ్నించారు. కమలాపురం నియోజకవర్గంలో వైఎస్ఆర్ సీఎం అయినప్పుడు మూడు టీఎంసీల నీరు నిల్వ కోసం సర్వరాయసాగర్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారని, అందులో ప్రస్తుతం నీళ్లు ఉన్నాయని కానీ వాటిని ఉపయోగించుకునేందుకు పిల్ల కాల్వలు కూడా లేవని పేర్కొన్నారు. ఆ నీరు జగన్ మేనమామ, ప్రస్తుత ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి చేపల చెరువుకు, జగన్ ఏర్పాటు చేసుకున్న భారతి సిమెంట్స్‌కు ఉపయోగపడుతోందన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీకి అండగా ఉండి జిల్లాలోని కమలాపురం నియోజక వర్గాన్ని అత్యంత మెజార్టీతో గెలిపించాలని ఆయన తెలిపారు. టీడీపీ యువ నాయకుడు సాయి నరసింహారెడ్డి, విజయ్‌కుమార్, ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా, వికాస్ హరిక్రిష్ణ, లేటపల్లె శివరాం, మన్నూరు అక్బర్, నాగేశ్వర్ రావు, ఉమాకాంత్, తిరుమలయ్య, గోపాల్, ఓబయ్య, మేకల బాబు తదితరులు పాల్గొన్నారు.

పుత్తా ఆధ్వర్యంలో టీడీపీలో 50 కుటుంబాలు చేరిక

సీకేదిన్నె, ఫిబ్రవరి 12: బాబుతోనే రాష్ట్ర భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం బాలుపల్లె, పాపాసాహెబ్‌పేట, చెర్లోపల్లె, అశ్వర్థగారిపల్లె, కొత్త నరసన్నపల్లి తదితర గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా బాలుపల్లి తదితర చోట్ల 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో సంక్షేమానికి, అభివృద్ధికి అ ధిక ప్రాముఖ్యతనిచ్చి రాష్ట్రాన్ని అన్నివిధాలా ముందుకు నడిపించాడన్నారు. టీడీపీ మినీ మేనిఫెస్టో ద్వారా మహిళలు, యువతకు అధిక ప్రాధాన్యం ఇచ్చారన్నారు. టీడీపీలో చేరిన వారిలో సి.గోపాల్, సురేంద్ర, నాగార్జున, శేషయ్య, రంగయ్య, ఆర్ఎంపీ సుబ్బయ్య, రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో యువనాయకులు పుత్తా చైతన్యరెడ్డి, కృష్ణారెడ్డి, మోహన్‌బాబు, డీవీ సుబ్బారెడ్డి, డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, గోపాల్‌రెడ్డి, మధు, సురేంద్ర, మహేష్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నర్సుల జీవితాలతో ఆటలొద్దు

●నర్సింగ్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న నర్సులు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 12: కరోనా సమయంలో రోగుల ప్రాణాలను కాపాడేందుకు ప్రాణాలను సైతం పణంగా పెట్టి మరీ సేవలందించిన నర్సుల జీవితాలతో జగన్‌రెడ్డి ప్రభుత్వం చెలగాటమాడడం సరైంది కాదని ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ స్ట్రగుల్ కమిటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంతగా కాంట్రాక్ట్ పద్ధతిపై ప్రభుత్వ ఆసుపత్రులలో గత 14 సంవత్సరాలుగా సుమారు 11,500 మంది నర్సులు రోగులకు సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. వీరిని పాలక ప్రభుత్వాలు రెగ్యులర్ చేసిన పాపాన పోలేదన్నారు. ఇందుకు నిరసనగా సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రాష్ట్ర నర్సింగ్ అధికారుల ఆత్మీయసమ్మేళన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికలకు ముందు ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేస్తున్న వారందరినీ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అధికారం చేపట్టి 5 సంవత్సరాలకు దగ్గరవుతున్నా ఇంతవరకూ అతీగతీలేకుండా హాస్పిటల్స్, డాక్టర్స్‌ను పెంచుకుంటూ నర్సులను ఏ మాత్రం పట్టించుకోకుండా కాలయాపన చేయడం బాధాకరమన్నారు. కరోనా సమయంలో వీరి సేవలు అనితరసాధ్యమన్నారు. నర్సుల సేవలను పూచికపుల్లతో సమానంగా చూడడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో నర్సులు చిన్నారి, శిరీష, కమాల్‌బీ, మహేశ్వరి, సుధారాణి, రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

విద్యాశాఖలో వెట్టిచాకిరీకి తెరలేపిన ప్రభుత్వం: యూటీఎఫ్



డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులను దహనం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 12 : మెగా డీఎస్సీ వస్తుందని ఆశచూపి కేవలం ఆరువేల పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం తీవ్ర నిరాశకు గురి చేసిందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు ధ్వజమెత్తారు. సోమవారం సాయంత్రం కడప కలెక్టరేట్ ఎదుట అప్రెంటిస్ విధానంతో విడుదల చేసిన డీఎస్సీ నోటిఫికేషన్‌కు సంబంధించిన ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాశాఖలో వింత పోకడలకు ఈ ప్రభుత్వం పాల్పడుతోందన్నారు. ఉన్న సమస్యలను పరిష్కరించకపోగా కొత్త సమస్యలను సృష్టించి ఉపాధ్యాయులను గందరగోళంలోకి గురిచేసే ప్రణాళికతో ముందుకు వెళ్లడం సిగ్గుచేటన్నారు. గతంలో ఉన్న అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయించుకోవడం కోసం 15 సంవత్సరాల పాటు సుదీర్ఘ పోరాటాలు చేశామని, వైఎస్ఆర్ సీఎంగా ఉన్న సమయంలో 13 రోజులపాటు సమ్మె కూడా చేసి అప్రెంటిస్ విధానం రద్దు చేయించుకోగలిగామని గుర్తు చేశారు. అయితే జగన్ తన తండ్రి రద్దు చేసిన వెట్టిచాకిరీ విధానాన్ని పునరుద్ధరించడం ఎంత వరకు సమంజసమో ఆలోచించుకోవాలన్నారు. ఇప్పటికైనా పునరాలోచించి విడుదల చేసిన అప్రెంటిస్ విధాన డీఎస్సీ నోటిఫికేషన్ రద్దు చేసి రెగ్యులర్ ప్రాతిపదికన నియామకాలు చేసే విధంగా మరో నోటిఫికేషన్‌ను విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో ఉద్యోగ, ఉపాధ్యాయ నిరుద్యోగ ప్రజా సంఘాలను ఏకం చేసి ప్రభుత్వం మెడలు ఉంచి ఈ జీవోలు రద్దు చేయించుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు రవికుమార్, ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎజాజ్ అహ్మద్, నాయకులు కేదార్‌నాథ్, బత్తుల చంద్రశేఖర్, గోపినాథ్, అబ్దుల్‌గని, కిరణ్‌బాబు, పోతురాజు, చంద్రశేఖర్, బాబు, జానకిరామ్, శ్రీనివాసులు, కొండయ్య, సుజిత్‌కుమార్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

విద్యుత్తు కోతలకు నిరసనగా రైతుల ధర్నా



విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలియజేస్తున్న రైతులు

సీకేదిన్నె, ఫిబ్రవరి 12: విద్యుత్తు కోతలకు నిరసనగా రైతు సంఘం నాయకులు సోమవారం సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. చింతకొమ్మదిన్నె మండలం మూలవంక వద్ద సోమవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో పంటలు ఎండుతున్నాయని ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఉద్యాన పంటలైన అరటి, ఆకుతోటలు, చీనీ, బొప్పాయి, నువ్వు, వేరుశనగ, తదితర పంటలు బోర్ల కింద సాగు చేశారని, కరెంటు కోతలతో రైతులకు నష్టం వాటిల్లుతుందన్నారు. అధికారులు చెబుతున్న విధం గా 9 గంటలు వదలాల్సిన కరెంటు కేవలం ఏడు గంటలు మాత్రమే ఇస్తున్నారని అది కూడా ఎప్పుడు పడితే అప్పుడు కట్‌చేస్తున్నారని కరెం టు పోయినప్పుడు విద్యుత్తు శాఖ అధికారులకు ఫోన్ చేస్తే నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఇప్పటికైనా అధికారులు 9 గంటలు నిరంతరాయంగా కరెంటు సరఫరా చేయాలని కోతలు నివారించాలని లేనిపక్షంలో ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాల కృష్ణయ్య, సిద్దయ్య, హరి, రమణారెడ్డి, చిన్నసిద్దయ్య, వీరయ్య, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

●కడప లోక్ సభ కో-ఆర్డినేటర్ సుధాకర్ బాబు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 12: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలు పని చేయాలని కడప లోక్ సభ కో- ఆర్డినేటర్ సుధాకర్ బాబు పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో పీసీసీ మీడియా ఛైర్మన్ తులసిరెడ్డితో కలిసి మాజీ ఎమ్మెల్సీ, లోక్ సభ కో- ఆర్డినేటర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ రాష్ట్రంలో వైసీపీ ప్రజావ్యతిరేక పాలన చేస్తున్నాయని మండిపడ్డారు ఈ రెండు పార్టీల రాక్షస పాలనకు ప్రజలు విసిగిపోయారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ప్రజారంజక పాలన అందించే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలన్నారు. విభజన చట్టంలో పొందు పరచిన హామీలు తుంగలో తొక్కిన జగన్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ది చెప్పాలన్నారు. వైసీపీ పాలన అంతా బీజేపీకి దాసోహంగా మారిందని, విభజన హామీలు ప్రత్యేక హోదా మాట మరచిందని విమర్శించారు. తులసిరెడ్డి మాట్లాడుతూ అరకు లోయ కాఫీ పంటలకు ప్రసిద్ధి అని, నేడు జగన్ పాలనలో గంజాయి సాగులో దేశంలో అగ్రగామిగా నిలిచిందని ఎద్దేవా చేశారు. అప్పులు కుప్పలు తెప్పలుగా తెచ్చి రుణాంధ్ర ప్రదేశ్‌గా మార్చారని, బీజేపీ బానిస పార్టీలను ఇంటికి సాగ నంపాలన్నారు.కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే 6 సూత్రాల కార్యక్రమం అమలు చేస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి కో- ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీరాములు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నజీర్ అహమ్మద్, రాష్ట్ర అధికార ప్రతినిధి విజయజ్యోతి, రాష్ట్ర నేతలు ఎస్ఏ సత్తార్,చీకటి చార్లెస్,నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి, అసెంబ్లీ కన్వీనరు సుబ్రమణ్యంశర్మ,పూల నజీర్,శ్యామలమ్మ మదు రెడ్డి,ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీల ఆత్మగౌరవ సభను దిగ్విజయం చేయండి'



హాన్సేన్‌కు నియామక పత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 12: చట్టసభలలో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, అలాగే బీసీ కుల జనగణను కేంద్రమే చేపట్టాలని డిమండ్ చేస్తూ ఈ నెల 18న ప్రొద్దుటూరులో తలపెట్టిన బీసీల ఆత్మగౌరవ సభను దిగ్విజయం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, ప్రధాన కార్యదర్శి త్రివిక్రమ్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆ మేరకు సోమవారం స్థానిక పాత రిమ్స్‌లో గల బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సభకు జాతీయ, రాష్ట్ర, జిల్లాలోని బీసీ నా యకులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. జనాభాపరంగా అత్యధిక శాతం ఉన్నప్పటికీ నేటికీ అతి తక్కువ జనాభా శాతం కలిగిన వారి పాలనకు పల్లకీలు మోసే బోయలుగా బీసీలు మిగిలారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఎంతకాలం మోయాలో అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. పాలకుల కారణంగా బీసీలకు ఇంతటి అన్యాయం జరుగుతున్నా నేటికీ కనువిప్పు కలగకపోగా పాలకులకు తొత్తులుగా మారిన తీరు బాధాకరమన్నారు.

నియామకాలకు ఉత్తర్వులు

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పి.పెద్ద ఓబులేసు, నగర ఉపాధ్యక్షుడిగా ఆర్. హాన్సేన్‌లకు నూతనంగా బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రామాంజనేయులు, నటరాజ్, ఖాదర్‌బాష, పి.అంజి, మహిళా అధ్యక్షురాలు నారాయణమ్మ పాల్గొన్నారు.

షటిల్ టోర్నమెంట్‌లో రన్నర్స్‌గా కడప డీసీసీబీ

కడప(రూరల్) ఫిబ్రవరి 12 : ఆప్కాబ్ స్పోర్ట్స్ రిక్రియేషన్ క్లబ్ అమరావతి ఆధ్వర్యంలో విజయవాడలో ఫిబ్రవరి 11న నిర్వహించిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో కడప డీసీసీ బ్యాం కు రన్నర్స్‌గా గెలుపొందింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార బ్యాంకు(విజయవాడ సహకారశాఖ) సంబంధించి రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలోని 13 డీసీసీ బ్యాంకులు, సహకార పరపతి సంఘాల సిబ్బందికి రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహించారు. ఈ మేరకు కడప జిల్లా సహకార కేంద్ర బ్యాంకు తరుపున ప్రాతినిధ్యం వహించిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఓఎస్‌డీ బి. గుర్రప్ప, డిప్యూటీ జనరల్ మేనేజర్ వై.ప్రతాప్‌రెడ్డి, అలాగే పురుషుల వెటరన్ విభాగంలో రాష్ట్రస్థాయి రన్నర్స్‌గా గెలుపొందారు. విజేతలు రన్నర్స్ ట్రోఫీని వ్యవసాయ, సహకారశాఖ అధికారి(ఐఏఎస్) బాబు చేతుల మీదుగా అందుకున్నారు.

చిరంజీవికి పద్మవిభూషణ్ రావడం సంతోషాన్నిచ్చింది

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 12: మెగా స్టార్ చిరంజీవికి పద్మవిభూషణ్ అవార్డు రావడం ఎంతో సంతోషాన్నిచ్చిందని చిరంజీవి యువత కడప జిల్లా అధ్యక్షుడు పండ్రా రంజిత్‌కుమార్ తెలిపారు. అవార్డు వచ్చిన సందర్భంగా చిరంజీవి హైదరాబాదు బ్లడ్ బ్యాంకులో అభిమానులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిరంజీవిని రంజిత్‌కుమార్ చిరంజీవికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రాణాలు పోతేగాని పట్టించుకోరా?



తుప్పుబట్టిన విద్యుత్ స్తంభం (ఇన్‌సెట్) దెబ్బతిన్న దృశ్యం

చెన్నూరు, ఫిబ్రవరి 12 : విద్యుత్ స్తంభం విరిగిపడి ప్రాణాలు పోతేగాని పట్టించుకోరా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి... గుర్రంపాడు పంచాయతీలో విద్యుత్ స్తంభం బాగా దెబ్బతిని విరిగిపోయే దశలో ఉంది. దీని ద్వారా ఆ పంచాయతీలో నాలుగు తాగునీటి మోటార్లకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ స్తంభం విరిగిపోతే విద్యుత్‌లైన్లతో ప్రమాదంతో పాటు తాగునీటికి కూడా ఇబ్బందేనని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్తంభం అడుగు భాగం తప్పుపట్టి పెచ్చులూడి మధ్యలో పెద్ద తొర్ర ఏర్పడి రెండు చివరల కొద్దిభాగం మాత్రమే తగులుకుని ఉంది. హైటెన్షన్ వైర్లు ఈ విద్యుత్ స్తంభానికి ఉన్నాయని, స్తంభం కూలితే భారీ ప్రమాదం జరుగుతుందని రైతులు పేర్కొంటున్నారు. దీనిపై సంబంధిత అధికారి దృష్టి సారించాలని తెలిపారు.

రైల్వే గూడ్సు, హమాలీల సమస్యలు తీర్చండి: ఏఐటీయూసీ



వినతిపత్రం అందిస్తున్న కేసీ బాదుల్లా

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 12 : కడప రైల్వే స్టేషన్‌లో గూడ్సు షెడ్డు హమాలీల సమస్యలు పరిష్కరించాలని సోమవారం కడప రైల్వేస్టేషన్ పరిశీలనకు వచ్చిన డీఆర్ఎం విన్నీత్‌సింగ్‌కు రైల్వే గూడ్సు హమాలీ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్ష, కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఎస్. మహబూబ్‌బాష వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫ్రిడ్జ్ చెడిపోవడంతో ప్రస్తుతం వేసవి కాలం కావడం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూనియన్ కార్యాలయంపైన నీటి ట్యాంకు ఏర్పాటు ఏసీ ప్యూరిఫైడ్ ఫిల్టర్స్ బిగించాలన్నారు. ఈ స మస్యను ఆరు నెలలుగా డీఆర్ఎంకు విన్నవించినా పరిష్కారం కాలేదన్నారు. అలాగే యూనియన్ కార్యాలయం పక్కనే రైల్వేలైనుకు ఉపయోగించిన సిమెంటు పోళ్లు ఉంచడం వల్ల వాటి కింద మురికినీరు నిల్వ చేరిందన్నారు. అలాగే అక్కడ విషపురుగులు ఉంటున్నాయని, వాటిని తొలగించి స్కూటరు పార్కింగ్ కోసం షెడ్డు నిర్మించాలని పేర్కొన్నారు. మరుగుదొడ్లు కూడా కార్యాలయ ఆవరణంలో కాకుండా బయటికి తరలించి తగినన్ని నిర్మించాలన్నారు.కార్యక్రమంలో రైల్వేగూడ్సు షెడ్ హమాలీ యూనియన్ నాయకులు పాల్, శ్రీను, చిన్న ఓబులేసు, గంగయ్య, సుబ్బరామ్, సూరి, మల్లి, రంగనాయకులు పాల్గొన్నారు.

యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలి

వీరపునాయునిపల్లె, ఫిబ్రవరి 12: చట్టసభలలో మాదిగలకు రాజకీయ సమన్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19వ తేదీన చేపట్టిన యుద్ధభేరి మహాసభను విజయవంతం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరిపల్లె రాములయ్య పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు తప్పెట శివ అధ్యక్షతన ఏపీ ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా గంగయ్య, ఉపాధ్యక్షుడిగా ఉత్తయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాములయ్య తెలిపారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

మోదీ పథకాలు తప్ప రాష్ట్రానికి జగన్ చేసిందేమీ లేదు: బీజేపీ



మాట్లాడుతున్న బొమ్మన సుబ్బరాయుడు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 12: ప్రధాని నరేంద్ర మోదీ పథకాలు తప్ప రాష్ట్రానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిందేమీ లేదని బీజేపీ కడప పార్లమెంట్ కన్వీనర్ బొమ్మన సుబ్బరాయుడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ అధికారం చేపట్టింది ప్రజలకు మంచి చేయడానికి కాదని, ఆ పార్టీ నాయకులు ప్రజల ఆస్తులను, భూములను, స్థలాలను, ఆక్రమించుకోవడం, దోచుకోవడం కోసమే అన్నారు. ఎదురు తిరిగిన వారిపై అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలు చేయడమే పరిపాటిగా మారిందన్నారు. కాగా దేశాన్ని అన్ని రంగాలలో అభివృద్ధిపరచడమే లక్ష్యంగా కేంద్రప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. మన రాష్ట్రంలో కూడా బీజేపీకి ప్రజలు ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు: ఎస్ఐ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్ఐ రుషికేశవరెడ్డి

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 12: క్రీడలతో యువతకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్థానిక ఎస్ఐ రుషికేశవరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక సీఎస్ఐ చర్చి గ్రౌండ్‌లో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడల వల్ల ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని గుర్తు చేశారు. క్రీడాస్ఫూర్తితో ఆడినప్పుడే ఉన్నత స్థానం పొందగలరన్నారు. క్రీడల వల్ల మానసింగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. గ్రామస్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించాలని సూచించారు. మొదట బ్యాటింగ్ చేసిన సన్నీ లెవెన్ కడప జట్టు 16 ఓ వర్లు ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 142 పరుగులు చేశారు. రెండో బ్యాటింగ్ చేసిన టీం సీబీఐటీ ప్రొద్దుటూరు వారు 76 పరుగులకు ఆల్ అవుట్ అయ్యారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కలసపాడు, ఫిబ్రవరి 12 : మండలంలోని తెల్లపాడులో త్రైత సిద్ధాంత భగవద్గీత దాని అనుబంధ గ్రంథాలపై, శివరాత్రి, మాఘమాసం ప్రత్యేకతపై సోమవారం ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. కార్యక్రమంలో త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక, గిద్దలూరు కమిటీ అధ్యక్షుడు రమేష్ పాల్గొని మాట్లాడారు. మాఘమాసం శుక్ల చతుర్ధశి రోజునే శివరాత్రిగా నిర్ణయించారన్నారు. అలాగే మాఘ పూర్ణిమ భగవంతుని జన్మను తెలుపుతుందని అన్నారు. ప్రబోధ సేవా సమితి సభ్యులు శివ, సుభాషిణి, వెంకటేశ్, లీలా, నారాయణ, భాగ్యం, పుల్లమ్మ, ఖాదర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వసతులతో కూడిన వసతి గృహం ప్రారంభం

వేంపల్లె, ఫిబ్రవరి 12: విద్యార్థులకు నాణ్యమైన వసతులతో కూడిన బీసీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని ప్రారంభించినట్లు ఎంపీపీ ఎస్.లక్ష్మి గాయత్రి, మండల కన్వీనర్ కె.చంద్ర ఓబుళరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఎదుట నిర్మించిన వసతి గృహాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ పేద బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం ప్రభుత్వం మండలంలో మూడు సాంఘిక సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేసిందన్నారు. నాణ్యమై విద్యతో పాటు రుచికర భోజనం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సహాయ అధికారి నాగేంద్రరాజు, వెల్ఫేర్ అధికారి రాజాబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త నిబంధనలపై డ్రైవర్లకు అవగాహన



మాట్లాడుతున్న ఎంవీఐ ప్రసాద్

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 11: కొత్త నిబంధనలపై పట్టణంలోని గూడ్స్ క్యారేజ్ డ్రైవర్, ఆటో డ్రైవర్లకు ఎంవీఐ ప్రసాద్ అవగాహన కల్పించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జాతీయ భద్రత 35వ మాసోత్సవాల సందర్భంగాఅవగాహన కార్యక్రమం చేపట్టి ఎంవీయాక్ట్ 2019 గురించి వివరించారు.

ప్రణాళికతో చదివి లక్ష్యం చేరుకోండి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సనావుల్లా

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 12: ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రణాళికతో చదివి మీరు నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని జనవిజ్ఞాన వేదిక జాతీయ సమాచార కార్యదర్శి పి.సనావుల్లా విద్యార్థులకు సూచించారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యం లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సన్నద్ధతపై అవగాహన సదస్సు నిర్వహించారు. సనావుల్లా మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం కలిగిన వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గంగిరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు పరీక్షలపై అవగాహన కల్పించేందుకు జేవీవీ చేస్తున్న కృషి ఉన్నతమైనదన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

కలసపాడు, ఫిబ్రవరి 12 : మండలంలోని తెల్లపాడులో త్రైత సిద్ధాంత భగవద్గీత దాని అనుబంధ గ్రంథాలపై, శివరాత్రి, మాఘమాసం ప్రత్యేకతపై సోమవారం ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక, గిద్దలూరు కమిటీ అధ్యక్షుడు రమేష్ పాల్గొని మాట్లాడారు. ప్రబోధ సేవా సమితి సభ్యులు శివ, సుభాషిణి, ఖాదర్, శేఖర్ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికలకు సంసిద్ధం కావాలి



ఖాజీపేట, పోరుమామిళ్లలో ప్రచారం చేస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్, బొజ్జ రోశన్న

ఖాజీపేట, ఫిబ్రవరి 12: ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రతి ఓటరూ సంసిద్ధంగా ఉండాలని మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. సోమవారం ఖాజీపేట మేజర్ పంచాయతీలోని పేరారెడ్డి కొట్టాలు, నందిపాడు కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి వద్దకు వెళ్లి చంద్రబాబు ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీల గురించి వివరించారు. కార్యక్రమంలో బీఎస్ శ్రీనివాసులు, జనసేన ఇన్‌చార్జి పందిటి మల్హోత్ర, టీడీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, కదిరుల్లా, హరినాథరెడ్డి, సుబ్బయ్య, కొత్తపేట బుజ్జి, పుల్లయ్యనాయుడు, రామానాయుడు, గండి వెంకటేష్, పల్లె గంగాధర్, వెంకటయ్య, శ్రీనివాసులు, కేకే బ్రదర్స్ పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలోని ఆరు పథకాలను వివరిస్తూ బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న ప్రచారం నిర్వహించారు. సోమవారం పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలో ఎస్టీ కాలనీ తదితర ప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ పై ప్రచారం నిర్వహిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, కల్వకూరి చిన్నవెంకటసుబ్బయ్య, కల్వకూరి నడిపి వెంకటసుబ్బయ్య, సీతా వెంకటసుబ్బయ్య, ఇమాంహుసేన్, తిరుమలశెట్టి సుబ్బారావు, ఎంపీటీసీ కల్వకూరి రమణ, బండి ఓబులేసు, మల్లికార్జునరెడ్డి, కల్వకూరి రమేష్, సంచర్ల మాజీ సర్పంచ్ సోమిరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

కలసపాడు..: మండలంలోని కరణంవారిపల్లె, మామిళ్లపల్లె గ్రామాల్లో సోమవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి టీడీపీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు.కార్యక్రమంలో బద్వేలు మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ ఎస్‌పి రంతుల్లా, మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, పట్టాభిరెడ్డి, భద్రయ్య, నాగేశ్వర్‌రావు, రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, మల్లికార్జున, లాల్‌పీరా, మద్దులేటి, వెంకటయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర భవిష్యత్తు మారుతుందని బొజ్జా అరుణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవి, మండల పార్టీ అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బయనపల్లె గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోరుమామిళ్ల మాజీ సర్పంచ్ హబీబున్నీసా, రమణారెడ్డి, సుబ్బారెడ్డి, గాజులపల్లె చంద్రశేఖర్‌రెడ్డి, మస్తానయ్య, భాస్కర్‌రెడ్డి వెంకట సుబ్బారెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

మైలవరం..: రాక్షస వైసీపీని భూస్థాపితం చేసి టీడీపీకి పట్టం కడుదామని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి సతీమణి జ్యోతి, తల్లి దేవగుడి సరస్వతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బెస్తవేముల గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సరస్వతి, మాజీ సర్పంచ్ శివరామిరెడ్డి, కొండయ్య, పాపిరెడ్డి, సూర్యపెద్దిరాజు,నాగయ్య, లక్ష్మయ్య, వెంకటసుబ్బయ్య, కృష్ణయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, భాస్కర్, మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: రాష్ట్రంలో వైసీపీని మట్టికరిపించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సోమవారం 40 వార్డు బుర్రసాధు మఠం ఏరియాలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 40 వవార్డు ఇన్‌చార్జ్ పల్లా లక్ష్మీదేవి, సాయిరాం, చత్తిరి గడ్డ బాషా, శూలం లక్ష్మీదేవి, శివప్రసాద్, సునీల్‌కుమార్, సుబ్బు, చౌడమ్మ, బోగాల లక్ష్మీనారాయణమ్మ పాల్గొన్నారు.

టీడీపీలో పలు కుటుంబాలు చేరిక



ఎర్రగుంట్ల, పోరుమామిళ్లలో టీడీపీలోకి ఆహ్వానిస్తున్న భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

ఎర్రగుంట్ల ఫిబ్రవరి12:మండల మండలంలోని పలు కుటుంబాలు సోమవారం టీడీపీలో చేరాయి. జమ్మలమడుగు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి వారికి టీడీపీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఎర్రగుంట్ల పట్టణం సుందరయ్య నగర్‌లో సుమారు 50కుటుంబాలు,కల్లమల్లలో దాదాపు 30కుటుంబాలు టీడీపీలో చేరాయి.పార్టీలో చేరిన వారిలో సుందరయ్య నగర్‌కు చెందిన కె.ఈశ్వరయ్య, ఎం.చెన్నయ్య,కె.బాలు, మల్లికార్జున, పి.ప్రసాద్, వల్లి, రామచంద్ర,లక్ష్మీనారాయణ, కృష్ణమూర్తి, సుదర్శన్, కుళాయప్ప, వేణు, గిరి, నాగరాజు, జి.పీరయ్య, జి.బాబు, శివ, శంకర్, వి.నాగరాజు, చంద్ర,వాసు, మల్లి, ఎం.రమేష్,ఎం.సాల్మన్, బి.విజయ్, వెంకటశివ, రాజేష్,జయచంద్ర, దేవా తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ఇన్‌చార్జి జయరామిరెడ్డి, జంబాపురం రమణారెడ్డి,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బద్వేలులో టీడీపీ జెండా ఎగురవేస్తామని బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. సోమవారం సాయంత్రం పుల్లీడు పంచాయతీలోని పేరమ్మగారిపల్లెలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్ అధ్యక్షతన వైసీపీకి చెందిన డిస్కో రాజా, రామక్రిష్ణతో పాటు 30 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ చెరుకూరి చెన్నరాయుడు, పోరుమామళ్ల సర్పంచ్ యనమల సుధాకర్, కొండా రామక్రిష్ణారెడ్డి, ఎంపీటీసీ కల్వకూరి రమణ, తిరుమలశెట్టి సుబ్బారావు, బండి ఓబులేసు, శెట్టెం ప్రతాప్, సత్యరాజ్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు సజావుగా జరగాలి : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ సిద్ధార్థ కౌశల్

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 12 : రానున్న సార్వత్రిక ఎన్నికలలో ఎలాంటి హింసాత్మక ఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ సిద్ధార్థ కౌశల్ ఆదేశించారు. సోమవారం ఐఎంఏ హాలులో ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గ పోలీసు అధికారులు సిబ్బందితో కి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది చేపట్టాల్సిన కార్యచరణ ప్రణాళికపై ఎస్పీ దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, ప్రాంతాలపై ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడ్డ వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మద్యం నగదుతో ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రబుల్ మాంగర్లు, రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా వుంచాలన్నారు. వార్డు, గ్రామాల ప్రజలతో తత్సంబంధాలు పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ మురళీధర్, సీఐలు వెంకటరమణ, శ్రీకాంత్,రమణారెడ్డి, యుగంధర్,సుబ్బారావు ఎస్ఐలు పోలీసు ఆఫీసర్లు, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, ఎలక్షన్‌సెల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

5 సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు అందించాలి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 12: అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి అయిదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ మార్చి మూడు నుంచి ఐదు వరకు రెండు చుక్కల పోలియో మందు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ సూచించారు. జమ్మలమడుగు ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో పులివెందుల డివిజన్ పరిధిలోని పల్స్‌పోలియో రూట్ సూపర్‌వైజర్లకు పల్స్‌పోలియో కార్యక్రమంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎక్కడా సమస్యలు రాకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శాంతికళ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ మునిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలను జాగ్రత్తగా నడపాలి

చాపాడు, ఫిబ్రవరి 12: విద్యార్థులు వాహనాలను డ్రైవింగ్ చేసేటప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగకుండా జాగ్రత్తగా నడపాలని ప్రొద్దుటూరు ఆర్టీవో మురళీధర్ అన్నారు. సీబీఐటీ కాలేజీలో సోమవారం రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మురళీధర్ మాట్లాడుతూ విద్యార్థులు వాహనాలను అతివేగంగా హెల్మెట్ లేకుండా నడుపరాదన్నారు. డ్రైవింగ్ లైసెన్సు తప్పకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో మేనేజర్ మల్లికార్జునరెడ్డి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ నారాయణ నాయక్ , ఛైర్మన్ జయచంద్రారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై చర్యలు చేపట్టండి

మైదుకూరు రూరల్, ఫిబ్రవరి 12 : మైదుకూరులో తాగునీటి సమస్యపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతు సేవ సమితి జిల్లా అధ్యక్షుడు ఏవీ రమణ , మున్సిపల్ కమిషనర్ జబ్బార్‌మియాకు తెలిపారు . స్థానిక మున్సిపల్ కార్యలయం ఎదుట తాగునీటి సమస్యను పరిష్కరించాలంటూ ఆందోళన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రిష్ణాపురం గ్రామంలో తాగునీటి సమస్యపై అధికారులకు చెబితే కంటితుడుపు చర్యగా రెండు అదనపు పైపులు వేసి చేతులు దులుపుకొన్నారు. రెండు రోజులకే మళ్లీ తాగునీటి సమస్య మెదలైయిందన్నారు. అంతేకాకుండా బోరులో సుద్ద నీరు వస్తుండటంతో ప్రజలు తాగలేక పోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శాశ్విత పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు,నాగిరెడ్డి,షామీర్,జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వోప్లాంటు ప్రారంభించిన సర్పంచ్



ఆర్వోప్లాంటు ప్రారంభిస్తున్న యనమల సుధాకర్

పోరుమామిళ్ల, ఫిబ్రవరి 12 : పోరుమామిళ్లలోని ఓఎల్ఎఫ్ ఉన్నత పాఠశాల ఎలిమెంటరీ స్కూలు, కళాశాలకు సంబంధించి ఐదుల క్షల రూపాయలు విలువైన ఆర్వో ప్లాంటును పోరుమామిళ్ల సర్పంచ్ యనమల సుధాకర్ ప్రారంభించారు. పాఠశాల, కళాశాలలోని బాలికల వసతిగృహానికి తాగునీరు అందించాలన్న ఉద్దేశ్యంతో ఎంపీ సీఎం రమేష్ సుమారు ఐదు లక్షల నిధులు కింద మంజూరైన ఆర్వో ప్లాంటును సోమవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల, ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆరోగ్యరాణి, విజయరాణి ఉపాధ్యాయినిలు తదితరులు పాల్గొన్నారు.

105 మద్యం సీసాలు స్వాధీనం



పట్టుబడిన మద్యం సీసాలతో పోలీసులు

కాశినాయన ఫిబ్రవరి12: మండలంలోని ఇటుకులపాడు గ్రామానికి చెందిన రమణయ్య వద్ద నుంచి సోమవారం 105 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. కొంతకాలంగా రమణయ్య గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు రాబడిన సమాచారం మేరకు నిఘా ఉంచిపట్టుకున్నామన్నారు. ఆమేరకు రమణయ్యపై కేసునమోదు చేశామన్నారు.ఈకార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది వెంకటసుబ్బయ్య,సుధీర్ పాల్గొన్నారు.

కనకదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు



బద్వేలు టౌన్, ఫిబ్రవరి 12 : స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో కనకదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయప్రాంగణంలో సోమవారం నుంచి బుధవారం వరకు దుర్గాదేవి సమేత మల్లేశ్వరస్వామి నూతన బ్రహ్మసూత్ర శివలింగ ప్రతిష్ట ఉత్సవమూర్తుల సంప్రోక్షణ, కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారికి వేకువజాము నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హోమాలు తదితరాలు నిర్వహించారు. ఆలయ కమిటీ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు

రాజుపాలెం, ఫిబ్రవరి 12 : మండల పరిధిలోని టంగుటూరు గ్రామంలో సోమవారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ నారాయణరెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు ద్వారా రైతులకు క్వింటాకు రూ.3180 లబ్ధి చేకూరుతుందన్నారు. మండంలోని ఆయా ఆర్‌బీకేల వద్ద పంటలను కొనుగోలు చేస్తారని తెలిపారు. ఏవో శివరామక్రిష్ణారెడ్డి, గౌతంరెడ్డి, మణికంఠ, గణేష్ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు మృతి

బి.కోడూరు, ఫిబ్రవరి 12 : మండల పరిధిలోని ఐత్రంపేట గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు సిద్దు క్రిష్ణారెడ్డి (55) అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కాలేయం, గుండె తదితర వ్యాధులతో గత రెండు నెలలుగా చికిత్స పొందుతున్నాడు. ఆయన వారం క్రితం చికిత్స చేయించుకుని వచ్చారు. సోమవారం ఉదయం ఆయన మృతి చెందారు. మృతునికి కుమారుడు, కుమార్తె, భార్య ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ పరామర్శించారు. మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి, పవన్, రాఘవరెడ్డి, రవిక్రిష్ణారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.

కాశినాయన తహసీల్దారుగా వీఎన్‌వీఆర్ క్రిష్ణ

కాశినాయన ఫిబ్రవరి12: కాశినాయన మండల తహసీల్దారుగా వీఎన్‌వీఆర్ క్రిష్ణాను నియమిస్తూ కలెక్టర్ విజయరామరాజు ఆదేశాలు జారీచేశారని డిప్యూటీ తహసీల్దారు ప్రసన్నలక్ష్మీ తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న రామచంద్రుడు ఇటీవల నంద్యాల జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కడప ఆర్డీవో కార్యాలయంలో కేఆర్‌ఆర్‌సీగా పనిచేస్తున్న క్రిష్ణాను నియమించారు.

శంఖారావంతో ప్రజల్లో చైతన్యం

చాపాడు, ఫిబ్రవరి 12: నారా లోకేశ్ చేస్తున్న శంఖారావం పాదయాత్రతో ప్రజల్లో అవగాహన పెరుగుతోందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి అన్నారు. సీఎం జగన్ పాలనలో ప్రజలు, నిరుద్యోగులు, మహిళలు అసంతృప్తితో ఉన్నారన్నారు.వైసీపీ నాయకులు చేస్తున్న అరాచకులు, దౌర్జన్యాలను లోకేశ్ ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో టీడీపీ గెలువగానే సంక్షేమ పథకాలను అమలు చేస్తారన్నారు.

16న జరిగే బంద్‌ను జయప్రదం చేయండి

కొండాపురం, ఫిబ్రవరి 12 :ఈ నెల 16న జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని వామపక్ష రైతు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, మనోహర్‌బాబు, వెంకటరమణ, జయంతు,అమరనాథరెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీకి విద్యార్థి చరణ్ ఎంపిక

చాపాడు, ఫిబ్రవరి 12: మండలంలోని నరహరిపురం గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన చరణ్ అనే విద్యార్థి రాష్ట్రస్థాయి సైన్స్ ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ నరసింహశాస్త్రి తెలిపారు. ఈనెల 10, 11 తేదీల్లో బద్వేలు పట్టణంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో అధికారులు చరణ్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు. చరణ్ ఎలక్ట్రానిక్స్ పరిజ్ఞానంతో గోడౌన్లలో ఆహార ధాన్యాల నిలువ చేసే విధానంపై ప్రాజెక్టు నిర్వహించారు. మార్చి నెలలో చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో చరణ్ పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. చరణ్ 8వ తరగతి చదువుతున్నాడు. హెడ్మాస్టర్, గైడ్ టీచర్ సురేంద్రబాబు, మురళీకృష్ణ తదితరులు చరణ్‌ను అభినందించారు.

బద్వేలులో సినీ ప్రముఖుల సందడి



తీర్థ ప్రసాదాలు అందుకుంటున్న గీతాసింగ్ తదితరులు

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 12 : కితకితలు సినిమా హీరోయిన్ గీతాసింగ్, హాస్యనటుడు సుమన్‌శెట్టి, జబర్దస్త్ ఆర్టిస్ట్ చిట్టిబాబు సోమవారం బద్వేలు పట్టణానికి వచ్చారు. వల్లెరవారిపల్లెలోని లక్ష్మీనరసింహస్వామి ప్రధాన అర్చకుడు పెంచలయ్య స్వామిని కలిసి లక్ష్మీనరసింహ స్వామి విశిష్టతలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి స్వామివారి రక్షణ కంకణం, ప్రసాదాలను అందించారు.

కాలువల్లో పేరుకున్న జంబు

ఇబ్బందుల్లో రైతులు



ఉత్తర కాలువలో పేరుకున్న జంబు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 12: జమ్మలమడుగు, మైలవరం మండలాల్లో ఉత్తర కాలువ, దక్షిణ కాలువల్లో జంబు పేరుకుంది. మోరగుడి గ్రామ శివార్లలో, అలాగే గూడెం చెరువు, సున్నపురాళ్లపల్లె తదితర గ్రామాల దక్షిణ కాలువలో జంబు పేరుకుంది. మైలవరం జలాశయం నుంచి కాలువలకు నీటిని విడుదల చేశారు. ఎండాకాలంలో పంట పొలాలకు సాగునీరు అందించేందుకు కొంతవరకు నీటిని విడుదల చేసినట్లు రైతులు తెలిపారు. కాలువల్లో జంబు చేరుకోవడంతో నీరు ఆయకట్టు రైతాంగానికి అందడంలేదని మోరగుడి గ్రామంలోని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉత్తర, దక్షిణ కాలువల్లో పేరుకున్న జంబును తొలగించాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పడకేసిన పారిశుధ్యం

● దోమలతో ప్రజలు ఇబ్బందులు ● అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు ● పట్టించుకోని అధికారులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 12: జమ్మలమడుగులోని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం పడకేసింది. ప్రధానంగా మేజర్ గ్రామ పంచాయతీ అయిన మోరగుడి గ్రామంలో డ్రైనేజీ కాలువలు వ్యర్థాలు నిలిచి శుభ్రం చేయక కంపు కొడుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. కాలువలకు పక్కనే పిచ్చిమొక్కలు, కంపచెట్లుమొలిచాయి. గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదురుగా, ప్రధాన రోడ్డుకు ఇరువైపులా, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద, ఎస్సీ కాలనీకి వేళ్లే దారిలో తదితర చోట్ల పారిశుధ్యం పడకేసింది. అలాగే మండలంలోని దర్మాపురం గ్రామంలో పారిశుధ్యం రోడ్డుపై పడకేసింది. స్థానికులు రోడ్డుకు పక్కనే కాలువల్లో, రోడ్డుపై చెత్తాచెదారం పడవేస్తున్నారు. సంబంధిత గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శలు వినపడుతున్నాయి. ఆయా గ్రామాల్లో సర్పంచులు నిర్లక్ష్యం కారణంగా పారిశుధ్య కార్మికులు పట్టించుకోక దోమలు పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ పరిధిలో డ్రైనేజీ కాలువల్లో వ్యర్థాలను తొలగించి డ్రైనేజీ నీరు కదిలే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రధాన రోడ్లపై పడకేసిన పారిశుధ్యాన్ని శుభ్రం చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యకు సంబంధించి సోమవారం కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో ముజఫర్ ఆయా గ్రామాల్లో సెక్రటరీలకు తెలియజేసి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



మోరగుడి రోడ్డుపై ఉన్న చెత్తా, చెదారం



దర్మాపురంలో డ్రైనేజీ కాలువలో పిచ్చిమొక్కలు, నిలువ ఉన్న వ్యర్థాలు